# ప్రజా తీర్పును శిరసావహిస్తా



కేసీఆర్‌తో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

- ఇన్నేండ్లు నన్ను ఆదరించినవారికి కృతజ్ఞతలు
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, డిసెంబర్ 5: అసెంబ్లీ ఎన్నికల ఫలితా ల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ను శిరసావహిస్తానని ధ ర్మపురి అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ గెలుపు కోసం నిరంతరం కృషి చేసిన కార్యకర్తలు, తనపై ఎంతో అభిమానంతో ఓటేసిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. మేడారం, ధర్మపురి కలుపుకొని ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇచ్చిన ప్రజలను మరిచిపోలేనని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో సహకరించిన ప్రజలకు, ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపుకోసం కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లోనూ ధర్మపురి నియోజకవర్గ ప్రజల వెంటే ఉంటానని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ప్రజలు మార్పు కోరుకున్నారని కార్యకర్తలకు సూచించారు. తన స్వప్రయోజనాల కోసం ఏనా డూ ఎవరిపైనా ఆరోపణలు చేయలేదని, నిత్యం అభివృద్ధి, సంక్షేమం కోసమే పరితపించానని, పరితపిస్తూనే ఉంటానని ఈ సందర్భంగా వివరించారు.

# కల్లుపోసి.. సారెపెట్టి..

- బద్ది పోచమ్మకు ఘనంగా బోనాలు



అమ్మవారి దర్శనం కోసం నెత్తిన బోజనంతో క్యూలో నిలబడ్డ భక్తులు

వేములవాడ రాజన్న అనుబంధ దేవాలయమైన శ్రీ బద్ది పోచమ్మకు మంగళవారం భక్తులు ఘనంగా బోనాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేస్తూ పురవీధులగుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కల్లు పోసి.. సారెపెట్టి.. బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలో బారులు తీరగా, పర్యవేక్షకుడు హరిహరనాథ్ ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. 'పాడిపంటలతో పిల్లాపాపలను సల్లంగసూడు తల్లీ' అంటూ అమ్మవారిని భక్తులు వేడుకున్నారు.

- వేములవాడ టౌన్, డిసెంబర్ 5

# కొండగట్టు కిట కిట



కొండగట్టు అంజన్న ఆలయ ప్రాంగాణంలో భక్తులు

కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచే నూతన పుష్కరిణిలో భక్తులు స్నానాలు చేసి, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ఆలయ చైర్మన్ మారుతీస్వామి క్యూలైన్లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్ , పర్యవేక్షకులు శ్రీనివాసశర్మ, సునీల్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, సంపత్, ఏఎస్‌ఐ చిలుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

-మల్యాల, డిసెంబర్ 5

# కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నేతలు





కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చల్మెడ లక్ష్మీనరసింహారావు

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు నేతలు కలిశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఇటీవల వేములవాడ నుంచి బీఆర్‌ఎస్ తరపున బరిలో నిలిచిన చల్మెడ లక్ష్మీనరసింహారావు కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, పలు కీలక అంశాలపై చర్చించారు.

-వేములవాడ, డిసెంబర్ 5

# ప్రజా సమస్యలపై పోరాడుతాం

- ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం
- బీఆర్‌ఎస్ శ్రేణులు అధైర్యపడద్దు.. అండగా ఉంటా
- పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



పెద్దపల్లి: ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, డిసెంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశపరిచినా, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని.. వారి వెంట తాను ఉంటానని, ప్రజా హితం పని కోసం చేద్దామని పిలుపునిచ్చారు పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నరేండ్లు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశామన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందించామని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో 90 శాతం మేర సీసీ రోడ్లు పూర్తి చేయించామని చెప్పారు. గ్రామాలను కలుపుతూ లింక్ రోడ్లు వేయించామని, నియోజకవర్గ కేంద్రం నుంచి నాలుగు మండలాలకు రెండు వరసల రహదారులు పూర్తి చేయించినట్లు తెలిపారు. మరో రెండు మండలాల రహదారుల పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. పెద్దపల్లి పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రజల మేలు కోసం పని చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. అలాగే, ఆ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకిచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గెలుపు హుందాతనాన్ని పెంచాలని, ఉన్మాదాన్ని కాదని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన చింతకుంట విజయరమణారావుకు శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి, జడ్పీటీసీలు గంట రాములు, తిరుపతిరెడ్డి, ఎంపీపీలు బండారి స్రవంతి శ్రీనివాస్, బాలాజీరావు, రేణుకాదేవి, రమాదేవి రాంగోపాల్‌రెడ్డి, స్రవంతి మోహన్‌రావు, పెద్దపల్లి ఏఎంసీ చైర్మన్ జడల సురేందర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

# నేలలను కాపాడుకోవాలి

- ప్రతి ఒక్కరూ పరిరక్షించే బాధ్యత తీసుకోవాలి
- సేంద్రియ సాగును ప్రోత్సహించాలి
- రిటైర్డ్ ఏడీఆర్ డాక్టర్ సీ చేరాలు
- కేవీకేలో ఘనంగా ప్రపంచ నేల దినోత్సవం




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చేరాలు

జమ్మికుంట, డిసెంబర్ 5 : నేలలు ఆరోగ్యంగా ఉంటేనే సకల జీవరాశుల మనుగడ సాధ్య మని, అందుకోసం ప్రతిఒక్కరూ నేలలను పరిరక్షించుకునే బాధ్యత చేపట్టాలని రిటైర్డ్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ (రీజనల్ అగ్రికల్చరల్ రీసెర్చ్ స్టేషన్, వరంగల్) సీ చేరాలు పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ప్రపంచ నేల దినోత్సవాన్ని నిర్వహించగా, ఆయన హాజరై మాట్లాడారు. మన భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే నేలలను కాపాడుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు అవసరాలకు మించి రసాయనిక ఎరువులు వాడవద్దన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసి, దేశ భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత రైతులదేనని స్పష్టం చేశారు. జమ్మికుంట వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, సహజ వనరులను సంరక్షించుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన నేలలను భవిష్యత్‌తరాలకు అందించే బాధ్యత మనదేనని, భూమిలో కర్బన శాతాన్ని పెంచాలన్నారు. కర్బన శాతం పెరగడంతో కలిగే లాభాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రజలంతా ప్లాస్టిక్‌ను వాడకూడదని ఆత్మ పీడీ ప్రియదర్శిని సూచించారు. ప్లాస్టిక్‌తో నేలల పరిస్థితులపై అవగాహన కల్పించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడడం, సాగు విధానాలపై కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ వెంకటేశ్వర్‌రావు వివరించారు. తర్వాత సేంద్రియ పద్ధతిలో సాగులో చేస్తున్న రైతులను సన్మానించారు. అనంతరం మృత్తిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు, డీల ర్లు, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు, విద్యార్థులు